క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్న పత్రాలు



పెనమలూరు: ఇంటర్ మీడియెట్ ప్రశ్న పత్రాలు శుక్రవారం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు మండలంలో 15 పరీక్ష కేంద్రలు ఏర్పాటు చేశారు. సుమారు ఏడు వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ మీడియెట్ బోర్డు నుంచి వచ్చిన ప్రశ్న పత్రాలను కస్టోడియన్‌లు జి.అనురాధ, షేక్ సుల్తానా, కె.దేవేందర్ స్వాధీనం చేసుకుని సీఐ ఆర్.గోవిందరాజు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఉన్నతాధికారుల దేశాలతో ఆయా పరీక్ష కేంద్రాలకు సకాలంలో ప్రశ్న పత్రాలు చేరవేస్తామని కస్టోడియన్‌లు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రత్యేక చర్యలు

పెనమలూరు: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని యువజన సర్వీసుల శాఖ సహాయ అధికారి నిమ్మగడ్డ నాగేశ్వరరావు తెలిపారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో 350 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కేరీర్ గైడెన్స్‌పై శుక్రవారం సదస్సు నిర్వహించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రధానంగా నాణ్యమైన విద్యా బోధనతో పాటు పేద విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. వైద్యులు శ్రీపతి జగదీష్, విజయరత్నం, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, పాలిటెక్నిక్ ఇన్‌చార్జి హేమ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: ఆస్తి తగాదాల కారణంగా భార్య, అత్తింటివారు భర్తపై దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమెదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన నేతింటి రామకృష్ణకు కొద్ది సంవత్సరాల క్రితం యనమలకుదురుకు చెందిన కె.భారతితో వివాహమైంది. రామకృష్ణ చెన్నైలో రైల్వేలో టీసీగా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావటంతో భారతి పుట్టింటికి వచ్చి ఉంటోంది. వారి మధ్య ఆస్తి తగాదాలు రావటంతో రామకృష్ణ యనమలకుదురులో ఉన్న భార్య వద్దకు వచ్చాడు. తన భార్య భారతి, మరదలు హారతి, అత్త సరస్వతి తనపై దాడి చేశారని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు పనులు ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతోపాటు అభివృద్ధి పనులు కూడా సమాంతరంగా నిర్వహిస్తున్నట్టు పలువురు వక్తలు పేర్కొన్నారు. నున్న గ్రామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులను జెడ్పీటీసీ సభ్యుడు కే సువర్ణరాజు, గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రాధాన్యత ప్రకారం గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.14 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, పంచాయతీ పాలకవర్గం సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, స్థానికులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. మండలంలోని పోరంకి కార్మికనగర్‌కు చెందిన పసుమర్తి మాధవ్, నున్నకు చెందిన పఠాన్ సమీర్‌ఖాన్ రెండు కిలోల గంజాయిని మన్యం ప్రాంతం నుంచి తీసుకొచ్చి వణుకూరు–పెనమలూరు మార్గంలో విక్రయించే యత్నం చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు స్పందించి నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు

గన్నవరం: రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని గన్నవరం సీఐ పి.కనకరావు హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం ట్రాఫిక్, లా అండ్ అర్డర్ పోలీసులు సంయుక్తంగా పట్టణంలోని జాతీయ రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనదారులకు, ఫుట్‌పాత్‌లను ఆక్రమణదారులకు సీఐ కనకరావుతో పాటు ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అందరూ సహకరించాలని చెప్పారు. దీనివల్ల ప్రమాదాలను కూడా నివారించవచ్చని తెలిపారు. పాదాచారులకు సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లను ఆక్రమణలను తొలగించాలని సూచించారు. ఎస్ఐలు శ్రీనివాస్, రమేష్‌బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మాత్రలతో పురుగులను నులిమేద్దాం

డీఎంహెచ్ఓ సుహాసిని



మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని ఎంపీడీఓ భార్గవి, డాక్టర్లు రవికాంత్, పద్మావతి



మాత్రలను ఎంఈఓకు అందచేస్తున్న ఎంపీడీఓ సునితాశర్మ, వైద్య శాఖ అధికారులు



హెచ్‌ఎంలు, ఆరోగ్య సిబ్బందికి మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ విమాదేవి



ఉపాధ్యాయులకు మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ దుర్గాప్రసాద్, కనకమహాలక్ష్మి

విజయవాడరూరల్: పిల్లల ఆరోగ్య సంరక్షణకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను తప్పనిసరిగా వేయాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. ఈ నెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నిర్మూలనకు మాత్రల (ఆల్బెండజోల్) సరఫరా మేళా జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సుహాసిని మాట్లాడుతూ మండలంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు, తప్పనిసరిగా మాత్రలు వేయాలన్నారు. డాక్టర్లు రవికాంత్, పద్మావతి, మాట్లాడుతూ మాత్ర లను సాధ్యమైనంత వరకు పిండి చేసి పిల్లలకు నోట్లో వేసేందుకు ప్రయత్నించాలన్నారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు పిల్లలకు మాత్రలు ఇస్తున్నామన్నారు. అనీమియా రావడం వలన ముందుగా అరికట్టడానికి మాత్రలు ఉపయోపడతాయని తెలిపారు. ఒకటి, రెండేళ్లలోపు వయస్సున్న పిల్లలకు అరమాత్ర వేయాలన్నారు. పెద్దవాళ్లకు కూడా ఈ మాత్ర ఇవ్వవచ్చని, మధ్యాహ్నం తర్వాత వాడాలన్నారు. ఎంపీడీఓ బి.భార్గవి మాట్లాడుతూ మండలంలో మొత్తం 51,800 మంది పిల్లలున్నారని వారందరికీ నులిపురుగులు నిర్మూలన మాత్రలను వేయాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి గ్రామాల వారీగా మాత్రలను ఎంపీడీఓ పంపిణీ చేశారు. తహసీల్దార్ పి.జాహ్నవి, ఎంఈఓ ఎ.వెంకటరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పెనమలూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 14వ తేదీన చిన్నారులు, విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన నులిపురుగుల మాత్రలను విద్యా శాఖ అధికారులకు అందజేశారు. ఎంపీడీఓ సునితా శర్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండోజోల్ మాత్రలను టీచర్లు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వేస్తారన్నారు. అన్ని పాఠశాలలకు ఈ మాత్రలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల వైద్యాధికారి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి తగిన మోతాదులో నులిపురుగుల నివారణ మాత్రలను ఈ నెల 14వ తేదీన వేసుకోవాలని సూచించారు. ఆ రోజు మాత్రలు వేసుకోని వారికి 18వ తేదీన మరో సారి పంపిణీచేస్తామని వివరించారు. ఆయా పాఠశాలల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సహకరించాలని సూచించారు. ఎస్‌సీడీ జాయింట్ డైరెక్టర్ శాస్త్రి, వైద్యులు రత్నగిరి, మహేష్, మండల విద్యాశాఖ అధికారిని కనకమహాలక్ష్మి, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

19 ఏళ్ల లోపు వారందరికీ మాత్రలు వేయాలి

ఉయ్యూరు: నులి పురుగు నివారణ మాత్రలను విద్యార్థులకు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ విమాదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీ–వార్మింగ్ డే సందర్భంగా నులి పురుగు నివారణ మాత్రల పంపిణీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉయ్యూరు పట్టణం, మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, వైద్య సిబ్బందితో సమీక్ష జరిపారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి నులి పురుగు మాత్రలను అందజేశారు. 19 ఏళ్ల వయస్సు లోబడిన చిన్నారులందరికీ మాత్రలను అందించాలని కోరారు. చిన ఓగిరాల పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ అనిల్, ఉయ్యూరు అర్బన్ హెల్త్ సెంటరు వైద్యాధికారి తేజస్విని పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యపరిరక్షణే లక్ష్యం

కంకిపాడు: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ అందరి లక్ష్యం కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్, ఎంఈఓ కనకమహాలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాఠశాలల హెచ్‌ఎంలు, వైద్య సిబ్బందికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. దుర్గాప్రసాద్, కనకమహాలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల విద్యాసంస్థల్లో ప్రతి ఒక్క విద్యార్థికి నులి పురుగు మాత్రలు చేరాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక సూచించారు. ఎంపీహెచ్ఈఓ భాస్కర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, అంజనేయులు, హెల్త్ అసిస్టెంట్లు రాచమల్ల శ్యాంప్రసాద్, శ్రీధర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: చిన్నారుల్లో నులిపురుగులను నిర్మూలించి, వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదల కోసం ప్రభుత్వం చేపట్టిన డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని బాపులపాడు ఎంపీడీవో కె.ప్రభాకరరావు, ఎంఈఓ సీహెచ్ సక్సేనారాజు అన్నారు. ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వనున్నట్లు చెప్పారు. మహాత్మగాంధీనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలకు మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. పిల్లల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పౌష్టికాహార లోపం, రక్తహీనత కలిగి నీరసంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా చెప్పారు. ప్రతి విద్యార్థికి మాత్రలను వేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యుడు నారయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.ఫణికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వి.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్లు నాగరాజు, శివాజీ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



పెనమలూరు: మండలంలోని కాలువ కట్టలపై నివసిస్తున్న ప్రజలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప కార్మికనగర్‌లో రూ.70 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలు నివశించే కాలనీలు, ప్రాంతాలను అభివృద్ధి చేస్తోందన్నారు. తాడిగడపలో చాలా మంది పేదలు కాలువ కట్టలపై నివశిస్తున్నందున వారికి కనీస మౌలికవసతులు కల్పిస్తామన్నారు. కాలువ కట్టలపై సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కాలువ కట్టలపై ఇంటి పన్నులు కూడా తగ్గించామని తెలిపారు. కమిషనర్ ప్రకాశరావు, పార్టీ నేతలు హనుమంతరావు, నర్రాచంటి, ముచ్చు నాగేంద్ర, ఆకునూరు సుబ్బారావు, వరప్రసాద్, మేడపర్తి లక్ష్మి, జగంగం జయాకర్, ఖాదర్ బాషా, పి.సాంబయ్య, జీవన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ బైపాస్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. విజ యవాడ వైపు వెళ్లుతున్న కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోతూ, అదుపు తప్పి అదే లారీని వెనుక భాగంలో ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. విజయవాడకు చెందిన మిట్ట దివ్య తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే సేఫ్టీ పోలీస్‌లు సంఘటనాస్థలానికి చేరకున్నారు. ఎస్ఐ సుందరరావు నేతృత్వంలో గాయపడినవారిని పోలీస్ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి హైవేపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

ప్రజల జీవితాల్లో నవరత్నాల వెలుగులు



తాడిగడపలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: నవరత్నాలతో తమ జీవాతాల్లో వెలుగు నిండాయని, జగనన్న పాలనలో పేదలకు పూర్తిగా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఏర్పడిందని మండలంలోని తాడిగడప కార్మికనగర్‌కు చెందిన అన్నం రాజేశ్వరి, కొప్పు రేవతి అన్నారు. తాడిగడప కార్మికనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొని లబ్ధిదారులకు అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ల అందచేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ నవరత్నాలతో తమకు ఆర్థిక సాయం అందుతోందన్నారు. వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ, ఇళ్ల స్థలాలు ఇలా అనేక పథకాలు అమలు చేయటంతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని సంతోషం వ్యక్తం చేశారు.

స్థానికంగా తాగునీరు, డ్రెయిన్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. కాలువ కట్టలపై నివశిస్తున్న పేదల ఇళ్లకు ఇంటి పన్నులు తగ్గించామన్నారు. మునిసిపాలిటీ పరిధిలోకి వచ్చిన తరువాత ఏడాదికి కేవలం రూ.54 మాత్రమే పన్ను వేస్తున్నామని తెలిపారు. తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు బాబి, హనుమంతరావు, నర్రాచంటి, కాకి శ్రీనివాసరావు, పొనుగుమాటి సాంబయ్య, జిన్నా, ఖాదర్ బాషా, క్రిష్టోఫర్, వరప్రసాద్, ఈదా రాజేష్, వల్లే నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం బాలమేళ జరిగింది. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు విద్యార్థులతో మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని, ఆటల్లో చురుగ్గా పాల్గొనాలని, ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. బాలలకు సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ధైర్యంగా చెప్పాలన్నారు. బాలల కోసం పని చేసే చైల్డ్ లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కి తెలియజేయాలన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్ జె.నానారావు, పీఎంసీ కమిటీ ప్రతినిధి షేక్ బాజీ పాల్గొని ఆటల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

18న నంద్యాలలో ఎమ్మార్పీఎస్ సభ

గన్నవరం రూరల్: ఈ నెల 18న నంద్యాలలో జరిగే ఎమ్మార్పీఎస్ మహిళా ప్రభంజనానికి మహిళలు తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి కోరారు. ముస్తాబాదలో ఈ మేరకు శుక్రవారం జరిగిన సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నాయకులు చోడవరపు రాంబాబు, నందేటి రంగారావు, యాకోబు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఆశీలు వేలం రూ.8.46 లక్షలు

ఉయ్యూరు: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆశీలు పాటకు బహిరంగ వేలం నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘు, సిబ్బంది మార్కెట్ ఆశీలుకు బహిరంగ వేలం నిర్వహించగా, ఆశీలు దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. జంపాన జంగమయ్య రూ.8.46లక్షలకు ఆశీలు హక్కు దక్కించుకున్నారు. గతేడాది ఆశీలు పాట రూ.4.05 లక్షలు మాత్రమే పలికింది. ఈ ఏడాది అనూహ్యంగా రెట్టింపైంది. మునిసిపల్ చరిత్రలో ఆశీలుకు ఇంత పెద్ద ధరకు గతంలో ఎప్పుడూ పలకలేదన్న చర్చ పట్టణంలో నడుస్తోంది.

జెడ్పీటీసీ ఎన్నికకు కసరత్తు



తుది ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచుతున్న ఎంపీడీఓ విమాదేవి

ఉయ్యూరు: ఉయ్యూరు జెడ్పీటీసీ ఉప ఎన్నికకు అధికారులు కసరత్తు చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఖాళీగా ఈ జెడ్పీటీసీ స్థానానికి, పంచాయతీల్లో వార్డు, ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయి యంత్రాంగం సమాయత్తమైంది. జెడ్పీటీసీ సభ్యురాలు యలమంచిలి పూర్ణిమ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. ఈ రాజీనామాను జిల్లా పరిషత్ సీఈఓ ఆమోదించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఎన్నిక నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు చేపట్టారు. మండలంలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మస్తాన్‌తో కలిసి ఎంపీడీఓ విమాదేవి పరిశీలన చేశారు. పోలింగ్ స్టేషన్‌ల వివరాలు, వసతులు, అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల నిర్వహణపై సమగ్ర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం తుది ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ.. మండలంలో 29189 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 33 పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికతో పాటుగా గండిగుంట పంచాయతీలో వార్డు స్థానం ఖాళీకావటంతో పదో వార్డుకు, పెద ఓగిరాల, ఆకునూరులో రెండో ఉపసర్పంచ్ ఎన్నికకు సమాయత్తంగా ఉన్నామన్నారు. నోటిఫికేషన్ విడుదల కాగానే సమర్థంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

స్పందన ఫిర్యాదులపై క్షేత్ర పరిశీలన



నున్నలో అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ జాహ్నవి

నున్న(విజయవాడరూరల్): స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి స్పందించారు. శుక్రవారం తహసీల్దార్ చేతులు మారిన అస్సైన్డ్ భూములను పరిశీలించారు. నున్న గ్రామంలో సుమారు 18 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పేదలకు పొలాలను పంపిణీ చేశారు. ఆ పొలాలను లబ్ధిదారులు అమ్ముకున్నారు. లబ్ధిదారుల వారసులు 14 మంది మా భూములను మాకు కేటాయించాలని మేడా రమణమ్మ స్పందన లో అర్జీలను అందజేశారు. ఆ భూములను తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వేయర్లు, వీఆర్వోలు పరిశీలించారు. అర్జీ దారులు ఎవరూ భూములవద్ద లేకపోవడంతో అధికారులు తిరిగి వచ్చారు. అనంతరం సర్వే నంబర్లు 314, 736, 823, 685 ల్లో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేయాలని వచ్చిన నాలా భూములను తహసీల్దార్ పరిశీలించారు.

పంటల నిల్వకు గోడౌన్లు నిర్మించాలి

సలహామండలి సమావేశంలో రైతుల వినతి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో వ్యవసాయోత్పత్తులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోడౌన్లు నిర్మించాలని వ్యవసాయదారులు కోరారు. శుక్రవారం నున్న గ్రామంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన మండల సలహా కమిటీ సభ్యులు మాట్లాడారు. వ్యవసాయ యంత్రపరికరాలను వ్యక్తిగతంగా అందజేయాలని కోరారు. జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఈ–క్రాప్ ఆధారంగా జొన్నలు కొనుగోలు చేయాలని అధికారులను రైతులు కోరారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానం చేశారు. రైతులు అడిగిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారదిశగా కృషి చేస్తామని చైర్మన్ నాగిరెడ్డి అన్నారు. ఎనికేపాడు గ్రామంలో 60 మంది రైతులకు ధాన్యం కొనుగోలు డబ్బులు రావాల్సి ఉందని ఆ గ్రామ వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మట్టా ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, సభ్యులు కేతుపల్లి దావీదు, దేవరపల్లి రాజశేఖర్, పోలారెడ్డి రమేష్ రెడ్డి, శనగల రాఘవేంద్రరావు, ఏడీఏ వెంకటేశ్వరావు, ఏఓ రంగనాథ్‌బాబు, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి

కంకిపాడు: పసుపు కొనుగోలు కేంద్రాన్ని కంకిపాడు కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలోని బోర్డు కార్యాలయంలో సలహా మండలి సమావేశం చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ప్రస్తుతం పసుపు పంట మార్కెట్‌కు వస్తున్న తరుణంలో రైతులకు మద్దతు ధర కల్పించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ధాన్యం రవాణా, హమాలీ చార్జీలు, పెండింగ్ బకాయిలు అందేలా చూడాలని, పంట కాలువల పూడికతీత పనులను చేపట్టాలని ఆయా శాఖలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్, తహసీల్దార్ టి.వి.సతీష్, ఏఓ పి.ఎం. కిరణ్, పశువైద్యాధికారి రవికుమార్, ఉద్యాన శాఖ అధికారి చందు జోసెఫ్, బోర్డు సభ్యులు నకరికంటి శేఖర్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● వలస జీవుల ఇంటి బాట



పొట్ట కూటి కోసం వలస వచ్చిన వ్యవసాయ కూలీల కుటుంబాలు పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణం కట్టాయి. సొంత ఇంటిని వదిలి భార్యాబిడ్డలతో వందల కిలోమీటర్లు వలస వచ్చి వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని నాలుగు రాళ్లు సంపాదించుకుని తిరిగి స్వగ్రామాలకు పయనమయ్యారు. రబీ సీజన్‌లో మినుము, పెసర తీత, మొక్కజొన్న పనులకు తెలంగాణాలోని ఖమ్మం జిల్లా నుంచి ఈడుపుగల్లు, కంకిపాడు, ఉప్పలూరు, మద్దూరు పరిసర ప్రాంతాలకు వచ్చిన వలస జీవులు శుక్రవారం ఇంటిబాట పట్టారు. ఈడుపుగల్లు వద్ద కనిపించిన వలసజీవులను 'సాక్షి' కెమెరాలో బంధించింది. – కంకిపాడు

పరిశ్రమను సందర్శించిన ఫార్మసీ విద్యార్థులు



బెంగుళూరులోని ఔషధ పరిశ్రమ వద్ద విజయ ఫార్మసీ విద్యార్థినులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ మహిళ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు కర్ణాటకలోని బెంగుళూరు ప్రాంతంలో ఉన్న అంతర్జాతీయ స్థాయి ఔషధ పరిశ్రమలను సందర్శించారు. మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్, కర్ణాటక యాంటీబయాటిక్ లిమిటెడ్, రెమెడిక్స్ ఫార్మా ఔషధ సంస్థలను బీ ఫార్మసీ మూడు, నాలుగో సంవత్సరాలకు చెందిన 90 మంది విద్యార్థినులు సందర్శించి పలు విషయాలను తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మలత మాట్లాడుతూ త్వరలో ఫార్మసీ రంగంలో అడుగుపెట్టనున్న విద్యార్థినులకు ఈ సందర్శన ఎంతో ముఖ్య మైనదన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థినులు కొత్త కొత్త ఔషధాలు తయారు చేసేలా తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు.

శ్రీచైతన్య పాఠశాల వద్ద ఆందోళన

పెనమలూరు: కానూరులో శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద ఓ విద్యార్థి బంధువులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం, ప్రకాశరావుపాలెంకు చెందిన కాశీవిశ్వనాథ్ కుమారుడు జశ్వంత్‌శ్రీసాయి నాలుగేళ్లుగా ఈ స్కూల్లో చదువుతున్నాడు. పదో తరగతి చదువుతున్న జవ్వంత్‌శ్రీసాయి ఈ నెల ఏడో తేదీన నైట్ స్టడీస్ ముగిసిన తరువాత కారిడార్‌లో తీగపై ఉన్న దుస్తులు తీస్తుండగా ఏసీ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై మరణించాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసుల అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేశారు. విద్యార్థి బంధువులు శుక్రవారం పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. జశ్వంత్‌శ్రీసాయి మృతికి కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కాలేజీ యాజమాన్యంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటన పై విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటాని సీఐ గోవిందరాజు తెలిపారు.

90 మందికి నేత్ర పరీక్షలు

కంకిపాడు: మండలంలోని గొడవర్రులో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 90 మంది వృద్ధులకు ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఏఎన్ఎం మెరుగుమాల ఏసు మేరీ, ఆశా కార్యకర్తలు కె.శివకుమారి, కరుణ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నేను ది. 15-9-2021వ తేదీన ఇంటి నుండి చిన్నఓగిరాల గ్రామ పంచాయితీ దగ్గర జిరాక్స్ సెంటరుకు వెళ్ళి తిరిగి వచ్చుచుండగా, మార్గ మధ్యలో నా యొక్క పాస్‌పోర్ట్ (పాస్‌పోర్ట్ నెం. F3031658, File No. HYD A 30113105 Issued date : 23-03-2005) పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

కామినేని గంగాధరరావు
S/o. సాంబశివరావు, డోర్ నెం. 4-46, చిన్నఓగిరాల, ఉయ్యూరు మండలం, కృష్ణాజిల్లా. ఫోన్ : 99638 35521